రాంనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా గడ్డం సతీష్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా గడ్డం సతీష్ నియమితులయ్యారు. బాగ్ లింగంపల్లికి చెందిన సతీష్ గతంలో డివిజన్ ప్రధాన కార్యదర్శితో పాటు యువ మోర్చా ప్రధాన కార్యదర్శిగా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ గడ్డం సతీష్‌కు డివిజన్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా గడ్డం సతీష్ మాట్లాడుతూ... తన ఎన్నికకు కృషి చేసిన రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌తో పాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి తన శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని అన్నారు.

గోపాల్‌రావు సేవలు చిరస్మరణీయం



గోపాల్‌రావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సుభాష్ చందర్‌జీ తదితరులు

అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్‌గా, కార్పొరేటర్ మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు అందించిన సేవలు ఎనలేనివని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గోపాల్‌రావు సంస్మరణ సభ ఆదివారం కాచిగూడ నింబోలిఅడ్డాలోని ఏకేభవన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గోపాల్‌రావు నిరంతరం సామాన్యుల సమస్యలపై పోరాడేవారని గుర్తు చేశారు. అరెకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, అంబర్‌పేట హిందూ శ్మశానవాటిక కార్యదర్శిగా సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఎస్పీ ఈరమాంజీ, ఏకే ట్రస్టు భవన్ చైర్మన్ ఎస్.కుషాల్, ప్రధాన కార్యదర్శి హెచ్.రమేష్‌కుమార్, కోశాధికారి కె.సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షులు జ్ఞానేందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి



బీసీ యువజన సంఘం రూపొందించిన కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జెల్లపెల్లి అంజి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు రిజర్వేషన్లు పెంచకపోవడం చూస్తుంటే బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతోందన్నారు. రిజర్వేషన్ పెంచకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం బీసీ యువజన కేలండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రామకోటి, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, ఎన్.శ్రీనివాస్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన



డ్రైవర్లను సత్కరిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ ఎర్రా

ముషీరాబాద్: జాతీయ రోడ్డు భద్రత మాసంలో భాగంగా ఆదివారం ముషీరాబాద్ బస్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గత కొన్నేళ్లుగా ఎలాంటి ప్రమాదాలు చేయకుండా డ్రైవింగ్ చేసిన డ్రైవర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్రా, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం, డిపో మేనేజర్ టి.కిషన్, బి.చందర్, సూపరెండెంట్ జె.శివరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి

అంబర్‌పేట: దేశ అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని మాజీ మంత్రి సీ.కృష్ణయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జీ.ఆనంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతులను పురస్కరించుకుని బీజేవైఎం గోల్నాక డివిజన్ అధ్యక్షుడు సింగీతం రాజేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, అమృత, నాయకులు ఎడెల్లి అయజ్‌కుమార్, శ్యామ్‌రాజ్, రవీందర్‌గౌడ్, నాగభూషణంచారి, యశ్వంత్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.











అవేకనింగ్ ఇండియా వాక్

• రామకృష్ణమఠంలో ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు • హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు

కవాడిగూడ: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి రామకృష్ణ మఠం వరకు ''అవేకనింగ్ ఇండియా వాక్''నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. స్వామి వివేకానంద ఔనత్యాన్ని తెలుపుతూ విద్యార్థులకు స్వదేశీ మంత్రాన్ని ఉచ్చరింపజేశారు. వివేకానంద స్వామి స్థాపించిన రామకృష్ణమఠం దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్నాయన్నారు. భగవాన్ రామకృష్ణ, శారదామాత సందేశాలను ప్రజల్లో వ్యాపింపజేసి సమాజంలో తగ్గుతున్న మానవతా విలువలను పెంపొందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ యోగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నాటక రూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

స్ఫూర్తి ప్రదాత.. స్వామి వివేకానంద



రామకృష్ణమఠంలో అవేకనింగ్ ఇండియా వాక్‌ను ప్రారంభిస్తున్న యోగా గురువులు, విద్యార్థులు

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వాడవాడలా జాతీయ యువజనోత్సవం

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. వివేకానందుడు సనాతన ధర్మ గొప్పతనాన్ని ప్రపంచ వేదికపై ఎలుగెత్తి చాటారని అన్నారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

– ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం





గోల్నాక డీమార్ట్ వద్ద వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య, బీఆర్ఎస్ నేత బి.వెంకట్‌రెడ్డి తదితరులు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న డీడీసీవోఎన్ విద్యార్థినులు



సుందరయ్యపార్కులో జరిగిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో వాకర్స్ క్లబ్ సభ్యులు



రాంనగర్ గుండు వద్ద వివేకానంద చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్.



అడిక్‌మెట్‌లో వివేకానందుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న నల్లకుంట వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు



నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వేడుకలో చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి, గ్రంథపాలకులురాలు చంద్రకళ



అశోక్‌నగర్‌లోని పార్కులో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత అభిషేక్ కెనడీ



వివేకా జ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, అధ్యక్షుడు దశరథ్

ఆరోగ్య సంరక్షణలో దంత పరిరక్షణ కీలకం



దంత పరీక్షలు నిర్వహిస్తున్న

నల్లకుంట: ఆరోగ్య సంరక్షణలో దంత పరిరక్షణ ఒక భాగమని, మానవ శరీరంలో దంతాలు అత్యంత కీలకమైనవని పననీయ డెంటల్ కళాశాల ప్రొఫెసర్, దత్త సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్. రంగా రెడ్డి అన్నారు. నల్లకుంట, అంబర్‌పేట, రామంతాపూర్, దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురి, నాగోల్ తదితర ప్రాంతాలలో ఉన్న దత్త సాయి మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రుల్లో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ ఎంఎస్ఆర్ రెడ్డి మాట్లాడుతూ.. చాలా మంది ఆరోగ్య పరిరక్షణకు ఇచ్చినంత ప్రాధాన్యత దంత సంరక్షణకు ఇవ్వడం లేదన్నారు. దంతాలు చక్కగా ఉంటే చిరునవ్వు మీ సొంతమని చెప్పారు. దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

◆ రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు వెయ్యి మందికిపైగా దంత పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. ఆస్పత్రి ఇన్‌చార్జి, చిల్డ్రన్స్ డెంటల్ స్పెషలిస్టు డాక్టర్ ధనేశ్వరి మాట్లాడుతూ.. చిన్న పిల్లల్లో దంత సమస్యలు అధికంగా ఉంటాయన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అశ్రద్ధ వహించకూడదన్నారు. దంత పరీక్షలు చేయించుకున్న వారందరికి ఉచితంగా టూత్ పేస్ట్‌లు అందజేశామన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ దంత వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొని దంత పరీక్షలు చేశారు.

డివిజన్ బీజేపీ అధ్యక్షుల నియామకం

అంబర్‌పేట: బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గంలోని నాలుగు డివిజన్లకు అధ్యక్షుల పేర్లను ఆ పార్టీ సెంట్రల్ జిల్లా కమిటీ ఆదివారం ప్రకటించింది. కాచిగూడ డివిజన్ అధ్యక్షుడిగా తంగడి బల్‌వీర్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కాడారి కృష్ణకుమార్, నల్లకుంట డివిజన్ అధ్యక్షుడిగా కె.ప్రశాంత్ జోషి, కౌన్సిల్ సభ్యుడిగా కెబి.నర్సింగ్‌రావు, గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా ఎస్.శ్రీధర్‌గౌడ్ కౌన్సిల్ సభ్యుడిగా దామోదర్ నాయుడు, అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా సిహెచ్.నరేష్‌గౌడ్, కౌన్సిల్ సభ్యుడిగా దాసోజు నాగభూషణంచారి నియమితులయ్యారు.

రంగవల్లుల పోటీలు



మహిళలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఆప్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ దిడ్డి సుధాకర్



'మహిళలపై హింసను ఆపాలి.. బాలికలను రక్షించాలి' అనే నినాదంతో ముగ్గుల పోటీల్లో వేసిన ముగ్గు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ముగ్గుల్లో ఉండే రంగుల వలే మన దేశంలో అన్ని కులాలు మతాల వారు కలిసి ఉండాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సూర్యానగర్‌లో రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళలకు విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ... సంప్రదాయ ముగ్గులతో పాటు ప్రజలను చైతన్యం పరిచే ముగ్గులను వేయడం హర్షణీయమని అన్నారు. నేడు చాపకింద నీరులా పాకుతున్న సైబర్ క్రైమ్‌ల గురించి ముగ్గులు వేయడం విశేషం అన్నారు. సంక్రాంతి పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ యమునా గౌడ్, మంజుశ్రీ, రత్నారావు, డాక్టర్ లక్ష్మణ్ నాయుడు, జావేద్ షరీఫ్, సురేందర్, ఈషాలి, హర్షిత, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లన్న జాతర

ముషీరాబాద్: బాకారంలోని ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి(మల్లన్న) బ్రహ్మోత్సవాలు 13వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి తెలిపారు. ఆదివారం జారత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం అంజిరెడ్డి మాట్లాడుతూ... 14వ తేదీన స్వామివారికి పంచామృతాభిషేకాలు, ఎదుర్కోళ్లు, గంగ తెప్పోత్సవ ఊరేగింపు, గొలుసు తెంపుట తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 15వ తేదీన మల్లన్నస్వామి కల్యాణం, అగ్నిగుండాల ప్రవేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, మాజీ చైర్మన్ ఊర్మిళ, సురేష్‌కుమార్, రామానంద్ రెడ్డి, యాదగిరి, రాజు, రవీందర్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ ఈవో రఘులు తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉషశ్రీ



అంబర్‌పేట: ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా అంబర్‌పేటకు చెందిన శంభూల ఉషశ్రీకాంత్‌గౌడ్ రెండోసారి నియమితులయ్యారు. ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎం.సునీతరావు చేతుల మీదుగా ఆమె నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఉషశ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి రెండోసారి బాధ్యతలు అప్పగించినందుకు అధిష్టానానికి రుణపడి ఉంటానన్నారు. తన పదవి తోడ్పాటుకు సహకరించిన మాజీ ఎంపి వి.హనుమంతరావు, సునీతరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

శోకసంద్రమైన ఇంద్రానగర్

• ధనుష్, లోహిత్‌ల భౌతికకాయానికి నేతల నివాళి • నింబోలిఅడ్డాలో ముగిసిన అంత్యక్రియలు





ధనుష్, లోహిత్‌ల భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, నగేష్‌ముదిరాజ్

ముషీరాబాద్: విహార యాత్రకు వెళ్లి కొండపోచమ్మ జలాశయంలో దుర్మరణం చెందిన అన్నదమ్ములు ధనుష్, లోహిత్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం నింబోలిఅడ్డాలో జరిగాయి. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు మృత్యువాతపడటంతో ఇందిరానగర్ శోకసంద్రమయ్యింది. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహ, బీజేపీ రాజ్యసభ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ మంత్రి శంకర్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్‌ముదిరాజ్ తదితరులు భౌతికకాయాలకు నివాళులర్పించారు. వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందజేశారు. అంతిమ యాత్రలో డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొన్నారు. దారి పొడవున ధనుష్, లోహిత్‌ల చిత్రపటాలను ఏర్పాటు చేసి వారి స్నేహితులు పాలాభిషేకం చేశారు. తల్లిదండ్రులు ఇద్దరు గుండెలవిసేలా రోధించడం అక్కడి వారి గుండెలను పిండేసింది.



ధనుష్, లోహిత్ అంతిమయాత్రలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



మృతుల తండ్రిని పరామర్శిస్తున్న వీహెచ్

మండలి ఉపఎన్నికల్లో మాదిగ ఉపకులాలకు అవకాశం ఇవ్వాలి

ముషీరాబాద్: రానున్న శాసన మండలి ఎన్నికల్లో మాదిగ, మాదిగ ఉపకులాలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించాలని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు పోకల కిరణ్‌మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... త్వరలో జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేట్ విద్యా సంస్థల అధిపతులకు టికెట్లు ఇవ్వొద్దని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఉన్నత విలువలు కలిగిన మానవతావాదులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి దయానందరావు, కళ్యాణ్ ప్రేమ్‌రాజ్, కొండల్ రావు, మాదిగ మహిళా నాయకురాలు పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

కంటోన్మెంట్: పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్‌గౌడ్ ఆదివారం గౌడకంఠమ్ జాతీయ మాస పత్రిక కేలండర్‌ను ఆవిష్కరించారు. హిమాయత్‌నగర్‌లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో గౌడ్ హాస్టల్ అధ్యక్షుడు మోతె చక్రవర్తి గౌడ్ , కాంగ్రెస్ ముఖ్య నాయకులు అద్దంకి దయాకర్ , జెఎస్ఆర్ గ్రూప్ సన్ సిటీ అధినేత డా. జడపల్లి నారాయణ గౌడ్, ఆర్టీసీ రిటైర్డ్ కంట్రోలర్ నోముల స్వామి గౌడ్, గౌడకంఠమ్ జాతీయ మాస పత్రిక ఎడిటర్ నోముల సిద్ధూ గౌడ్ పాల్గొన్నారు.

